# ?

కలా – నిజమా? కవులకల్పనలోనివా – వాస్తవంగా ఈలాటి ఘోరాలు జరుగుతాయా? విధికి అంత ఓర్వలేనితనం ఎందుకో?

*　　　　*　　　　*

మామూలుకన్నా కొంచెం ఆలస్యంగా నిద్రలేచాడు. బద్ధకంతీరేదాకా పక్కదిగకుండానే రాత్రి మొదలువేసిన నవలను ఆఖరుచేశాడు. అద్దం దగ్గర నిలుచుని క్రాఫ్ సరిచేసుకుని, తన అందాన్ని చూసి మురుస్తూ...ముసిముసినవ్వుతో చిత్రమూర్తిగా ఉన్నా, నవకాలు చిందిస్తూఉన్న హైమ ఫోటోగ్రాఫును చాలాసేపు సాకూతంగా వీక్షించాడు... "ఎన్నాళ్ళయింది వెళ్ళి – ఎప్పుడు వస్తుందో? ఈ అడుపడుచుల మొరాయింపులకు అంతు ఉంటేనా? పుట్టింట్లో విందులు కుడుస్తూ కూర్చుంటే 'ఇయం గేహే లక్ష్మీ' అని నమ్ముకుని ఆసపడుతూండేవాళ్ళపని మరి ఇంతేనా? చెపుతూంటాను, కథ వ్రాసిపెట్టమంటే ఏవో సాకులు చెప్పి తప్పించుకునే అలసత్వం అంతా ఎక్కడికి పోయింది? ఎగ్జిబిషన్‌కోసం వాళ్ళ అమ్మ ఏవో కుడుతూంటే, తనుకూడా అది పోయేదాకా అక్కడే ఉండాలేం?...నడుము వాల్చకుండా రోజా పొద్దస్తమానమూ కూచుంటున్నామంటే నా కేమన్నా ఒలికిందా ఇక్కడ?...నా జేబురుమాళ్ళకు పోగులుతీసి అంచులు కుట్టిపెడతానని ఇక్కడికి ఎన్ని వాయిదాలయినాయి? ప్రైజు వస్తుందిట. నేనున్నాను చాలదూ?...వాళ్ళనాన్న చవుకగా ఐదువందలకి దొరికానని కొని ఇచ్చాడుగా! అబ్బ! ఈ పెళ్ళాలన్నవాళ్ళు ఎప్పుడూ ఇంతే..."

మెట్లుదిగి వస్తున్నాడు. అంతలో ఆగిపోయి కలకంటున్నానా అని భ్రాంతితో హర్షవిస్ఫారితనయనాలతో చూసినాడు. నిజమే, హైమ – కటకటాలను ఆనుకుని నిలుచుని ఉన్నది.

మెట్లు లెక్కపెట్టుకుంటూ దిక్కులు చూస్తూ తాపీగా దిగే అలవాటు ఆ నిమిషాన మాయమైపోయింది. ఒక్క చెంగున ఆమెవద్దకు దూకేశాడు వరదరాజు. హైమ, అతని ఆవేగాన్ని గమనించి కొంచెం వైదొలగింది.

"నిజమేనా?"

"ఏమిటి?" అని హైమ అమాయికంగా చూస్తూ, ఏమీ తెలియనిదానిలాగాఅడిగింది.

"నిజంగా...నీవు–నీవేనా కనబడుతూంది?"

హైమ నవ్వింది.

"నిద్రలేవగానే ఎవరిమొగము–నా ముఖమే కాదూ చూసుకుంది? మంచిదేనన్న మాట––"

"ఇప్పుడేనా నిద్రలేవడం?"

"కాదు, చాలాసేపయింది...కాని--"

"ఇంతసేపటిదాకా ఏం చేస్తున్నారురూ మరి క్రిందికి రాకుండా?"

"కలగంటున్నాను. తమదర్శనభాగ్యం ఇంత త్వరగా ఈలా తలవనితలంపుగా--"

"చాల్లెండి..మరీ నేర్చుకుంటున్నారు..."

"నేర్పడానికి నీవు దగ్గరలేందేనా?"

"అన్ని ఉత్తరాలు వ్రాయకపోతే మీరు రాలేకపోయినారూ? సెలవరోజున వస్తే మనం ఇద్దరం కలిసి వచ్చేసేవాళ్ళం కాదూ?"

"నేను వస్తే...మరి రాణీగారికి తీరా దయవస్తుందో - రాదో, అసలు దర్శనమే కరవౌతుందేమోనని భయపడ్డాను."

"ఈ తలాయింపులకేం లెండి, బయలుదేరడానికి బద్ధకమనరాదూ?"

"పోనీ దయతలచి నీవే రావా అని---"

"అవును, ఈ మొగవాళ్ళమతమే ఇది. ఎవరికోసం వస్తుంది అని దిలాసా. పంపించి, తిరిగి మొగమైనా చూడరమ్మా... ఈ జాతిలక్షణమే ఇది."

వరద, మారుమాట చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయినాడు. స్నానాదికములు పూర్తిచేసుకుని వచ్చి హాల్లో కూర్చున్నాడు. హైమ వేషం మార్చేసుకుని సరిగపని చేసిన రాజ్‌పుటానా సిల్కుచీరె కట్టుకుని వచ్చి అతని సరసను నిలుచున్నది.

"మోహినిలాగా ఉన్నావు..."

హైమ చిరునగవుతో అతని ముంగురులు సరిచేస్తూ "నాకు తెలుసులెండి మీ మెత్తు. అమృతదానం- కాఫీ...కోసం ఇన్ని వగలా?"

కాఫీ కప్పుల్లో పోసింది. అతడు చూసి ఊరుకున్నాడు.

"తాగండి."

వరద, పసిపిల్లవాడిలాగా మారాంచేస్తూ బుంగమూతితో "భోజ్యేషు మాతా..." అని హైమవంక చూసి నవ్వాడు. ప్రేమ వెల్లివిరుస్తూఉన్న చూపులతో ఆమె కాఫీ అతనినోటికి అందించింది. అవకాశాన్ని పురస్కరించుకుని అతడు హైమను దగ్గరకు లాక్కున్నాడు.

"ఊ ఊఁ- ఉండండి - చూడండి మరి, చీరంతా కాఫీ తొణికింది.. ఇంతే మీరు ఎప్పుడూను..."

"పోనీలే, నాకేగా ఫైను...చెల్లారాంషాపును మళ్ళా ఒకమారు తాము పవిత్రం చేయాలిసిన అవసరం కలిగిందన్నమాట. ధన్యుణ్ణి..."

"ఈ మారే, లేత ఊదాలో కొనండి. ఎంబ్రాయిడరీలో చక్కని సన్నఅంచులవి వస్తున్నాయి..."

"జో హుకుం"

హైమ అతని బుగ్గలు సాగదీస్తూ "అంత నవ్వుగా ఉందేం? చెపుతానుండండి మీ పని. నా సంగతి అసలు మీరు--"

"మళ్ళా దేవిగారు పుట్టింటికి ప్రయాణం--"

"ఆఁ! అదేపని!...మీరు కావలిస్తే వెళ్ళండి...అత్తవారియింటికి..."

కాఫీ తాగడం అయింది. వరద కుర్చీలోనుంచి లేచాడు. సిగరెట్టు ముట్టించవలెనని ఆపేక్షపడి, మళ్ళా మానివేసి, నిలుచుని, హైమ భుజములమీద చేతులు వేసి, ఆమె చక్కదనాన్ని చూస్తూ "నీకు కోపం వస్తే తాళుకోలేను బాబూ! నాకు భయం వేసుకొస్తున్నది. నీవు మీవాళ్ళయింటికి ప్రయాణం కట్టావా అంటే--" అని ఆగాడు.

హైమ అతన్ని కౌగలించుకుని సిగ్గుతో -- విలాసంగా గాద్గదికంతో" -- "మిమ్మల్ని...విడిచి ఉండలేను...నేను అడిగినా, మావాళ్ళయింటికి పంపకండి" అని దీనంగా చూసింది.

అతడు "ఆc! అంతా నిజమే!" అని ఎకసక్కెము చేసినట్లు నటించాడు.

హైమ చెంపమీద చిన్న జెల్లా యిచ్చి లోపలికి పారిపోయింది. వరద సూట్ వేసుకుని కారులో కాలేజీకి వెళ్ళిపోయినాడు.

* * * *

వికసించినవి జాజి
విరులు నీ వేణిలో
ప్రకటించినవి వలపు
సుకుమార తనువల్లి...ఇక
ననలెత్తినవి భావ
నా నవ్య మాధురి
నవనవోదయ
నాలసవిలాస
అళికుమారీ గీతి
కా లాలితమ్ములై
అలయించినవి మల్లి
కా మందహాసాలు...

వెన్నెలలేని లోపం తీర్చడానికి 'వెలుగుదీపాలు' తంటాలుపడుతున్నాయి. హైమ, డ్రెసింగ్ టేబిల్ దగ్గర నిలుచుని తలలో పూలదండ సరిజేసుకుంటున్నది. 'మొగవాళ్ళు ఎంతకైనా తగుదురు. ఎంత నిబ్బరం! నాకోసం ఎంత ఉబలాటపడుతున్నా -- తపిస్తున్నా -- ఎదుట పడేటప్పటికి ఎందుకో అంత అభిమానం, ఆ దర్జా? అనిపించలేకపోయినానుగా అయనచేత...నానోటివెంటే చెప్పించారు. కానీ, ఇంటికి రానీ, భోజనం అయిన తరువాత ని-ద్ర-పో-తా-ను. ఊహుc...! సినిమాకు వెళ్దామని పట్టుబడతాను. నా కసితీరా --ఏం--నన్ను విడిచి ఉండలేనని అనకూడదేం?'

చీకటిపడింది బాగా. కారుచప్పుడౌతుందేమోనని హైమ చెవి ఒగ్గి ఏ ధ్వని అయినా వింటూంది. "అబ్బ - ఇవాళ కూడా ఆలస్యమేనా? రెండు నెలలకి - ఈ రాత్రి;- ఇంకెంత సేపటికి వస్తారో? ఇవిగో ఈ కొత్తపుస్తకాల దొంతర్లన్నీ మళ్ళా వచ్చిపడ్డాయి. మా అమ్మో! చదవనిస్తాననుకుంటున్నారు కాబోలు! అన్నీ దాచేయాలి. ఎప్పుడూ చదువేనా?...ఈ సిల్కు_షర్టులు ఎప్పుడు కుట్టించుకున్నారో? బాగున్నాయి...ఇవాళ ఇదే తొడుక్కోమంటా. మా నాన్న పెట్టిన పంచల మీదికి ఇవి చాలా చక్కగా ఉంటాయి. ఆ!...ఇదుగో, అసలుసంగతే మరచిపోయినానేం?

చాలా ఈ సిగరెట్లన్నీని? కాల్చి పొగ నామీదికి ఊదుతారు బాబోయ్...! అవి ఉన్నంతసేపూ నేనైనా కనబడతానా? సొరుగులో పెట్టి తాళం వేశేస్తా. ఎప్పుడన్నా ముచ్చటగా నే నిచ్చినప్పుడు కాని, ఎప్పుడూ అగ్నిహోత్రాలేనా?"

ఇంకా కొంచెం పొద్దుపోయింది. మామూలువేళకూడా దాటిపోతూంది...

"రావలసిందే ఈపాటికి...ఎక్కడ ఇంతసేపు ఏంచేస్తున్నారో? అదా సంగతి...పెంచరాడే వచ్చేస్తే నాకోసం పరిగెత్తుకునివచ్చారని ఉడికిస్తానని – ఎక్కడో తిరుగుతూ ఉండాలి... ఏం? అంత నదురేం? అబ్బ! ఈలాగైతే నే నుండలేను. రేపణ్ణుంచీ కారువెళ్ళేటప్పుడు నేనుకూడా బయలుదేరుతా. అక్కడనుంచి అలాగే షికారుకొట్టి ఇంటికి చేరుకోవచ్చును. అంతే, ఇకనుంచి ఆ పనే చేయాలి."

ఫోను మ్రోగింది.

హైమ, వినికూడా విసువుతో ఊరుకుంది; కాని అవతలవాళ్లు వదిలిపెట్టలేదు...రింగ్ చేస్తూనే ఉన్నారు... "ఎవరో బాబూ! వేళకు సరిగా సిద్ధమైనారు. ఎవరన్నా పిలిచారంటే ఈయన ఇల్లూవాకిలీ వదిలీ, పరుగెత్తుతారు. ఈవేళే – ఈ రాత్రే ఏమంతపని ముంచుకుపోతోందో? నేను పలకను. ఎంతసేపని పిలుస్తారో చూస్తాను."

ఆగిపోయింది.

"...అమ్మయ్య!...గండం గడిచింది...ఎనిమిది దాటుతూంది. ఇంకా రాలేదేమో? ఈపాటికి వస్తూండాలి. రానీ, పనిపట్టిస్తా. మరీ బొత్తిగా భయంలేక చెడిపోతున్నారు. చక్కగా అలంకరించుకుని ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తూంటే, తమ చిత్తం వచ్చినప్పుడు దయచేస్తారేం?"

మళ్ళా...ఫోను.

అవతలవాళ్ళను మనసులోనే మ్రింగేసే కోపంతో హైమ రిశీవరును అందుకుని పరధ్యానంగా--

"హలో!" అన్నది.

"జనరల్ – హాస్పిటల్"

"ఆ హాఁ"

"డాక్టర్ రామునీమీనన్ మాట్లాడుతున్నది; ప్రొఫెసర్ వరదరాజాకు – ప్రాణాపాయ–"

"ఏమిటి, – ఏమిటి మీ రంటున్నది..ఆఁ"

"కారు ట్రాముతో కొట్టుకున్నది..."

"ఆఁ! ఆఁ! ఎలా ఉన్నారు? చెప్పండి. ఎలా -- ఉన్నా–రు–?"

"స్పృహలేదు. వారి స్నేహితు -- భార్యను రమ్మనండి."

★ ★ ★